నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, గురువారం 25 జూలై 2024 | MEDAK

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న దొడ్డు ఉప్మా, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజ్ బీసీ వసతి గృహం బయట నీరు పట్టుకెళ్తున్న విద్యార్థులు

సంక్షేమ హాస్టళ్లు..సమస్యలకు నిలయాలు

- పక్కా భవనాలు లేక విద్యార్థుల అవస్థలు
- ఐదు నెలలుగా అందని డైట్‌చార్జీలు
- పంపిణీ చేయని నోట్‌బుక్స్, యూనిఫామ్స్, దుప్పట్లు
- విద్యార్థులకు తప్పని తిప్పలు

సిద్దిపేట, జూలై 24: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హాస్టళ్లలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాసిరకం భోజనంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో 300 మంది విద్యార్థులు ఉంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు నోట్‌బుక్స్, బెడ్ షీట్స్, కార్పెట్లు, యూనిఫామ్స్ పంపిణీ చేయలేదు. దీనికి తోడు ఐదు నెలల నుంచి డైట్ చార్జీలు ప్రభుత్వం విడుదల చేయలేదు.

సిద్దిపేట బీసీ హాస్టల్..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌కు పక్కా భవనం లేక అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. రెండు స్నానపు గదులు, రెండు టాయిలెట్స్ మాత్రమే ఉన్నాయి. ఉదయం విద్యార్థులు స్నానాలు చేసేందుకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్వాహకులు ప్రభుత్వ మెనూ పాటించడం లేదు. సిద్దిపేట పట్టణంలోని బీసీ బాలుర కాలేజీ విద్యార్థుల హాస్టల్‌కు సొంత భవనం లేదు. వందమంది విద్యార్థులు ఉంటున్నా నీటి సరఫరా లేక విద్యార్థులు బకెట్లలో నీళ్లు తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

డైట్ చార్జీలు రాక ఇబ్బందులు పడుతున్నాం

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లలో 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఐదు నెలల నుంచి ప్రభుత్వం డైట్‌చార్జీలు విడుదల చేయ లేదు. దీంతో విద్యార్థులకు భోజనాన్ని వడ్డించేందుకు అపుతెచ్చి ఖర్చుచేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒక్కో విద్యార్థికి రూ.1050 చొప్పున డైట్‌చార్జీలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు విడుదల చేయక ఇబ్బందిగా మారింది.

–మల్లేశం, వార్డెన్, ఇంటిగ్రేటెడ్ హాస్టల్, సిద్దిపేట

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీసీ హాస్టల్ భవనం

అసౌకర్యాలకు నిలయం వసతి గృహం

హుస్నాబాద్, జూలై 24: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని వెనుకబడిన కులాల విద్యార్థుల వసతి గృహం అసౌకర్యాలకు నిలయంగా మారింది. ప్రీమెట్రిక్ స్థాయిలో పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో నిర్వహిస్తున్న ఈ హాస్టల్‌లో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ అద్దె భవనంలో నడుస్తున్న ఈ హాస్టల్‌లోప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు నిత్యం ఇరుకు గదులు, రేకులషెడ్లలో ఉండాల్సి వస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భవనం లేక శాపంగా మారింది. మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులే కావడం వల్ల రేకులషెడ్లలో నిద్రించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ భవనాన్ని పోస్ట్ మెట్రిక్ (కళాశాల స్థాయి విద్యార్థులు) విభాగానికి అప్పగించి చిన్నపిల్లలు ఉండే ప్రీమెట్రిక్ హాస్టల్‌ను మాత్రం ఎలాంటి సౌకర్యంలేని ప్రైవేట్ భవనంలోకి మార్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు కూడా లేవు. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. అసౌకర్యాల భవనంతోపాటు ఇందులో చేరిన విద్యార్థులకు ఇప్పటి వరకు పుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేయలేదు. 2016 మెనూను (ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.31లు) ఇప్పటికీ అమలు చేస్తుండటం వల్ల పెరిగిన నిత్యావసర ధరలతో నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందడం లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెంచిన మెనూ చార్జీల జీవోజారీ చేయగా అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆజీవోను అమలు చేయడం లేదు. కాస్మొటిక్స్ బిల్లులు కూడా సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు కొరవడ్డాయి. కనీసం దుప్పట్లు పంపిణీ చేయలేదు.

సిద్దిపేట జిల్లా చేర్యాల గురుకులంలో ముద్దగా ఉన్న అన్నం, చికెన్‌కు బదులుగా తయారు చేసిన క్యాప్సికం

చేర్యాలలో మెనూ పాటించని నిర్వాహకులు

చేర్యాల, జూలై 24: సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వాహకులు మెనూ పాటించడం లేదు. బుధవారం విద్యార్థులకు చికెన్ పెటాల్సి ఉండగా నిర్వాహకులు క్యాప్సికం కర్రీ వండి పెట్టారు. చికెన్ కర్రీ ఎందుకు వండలేదని ఇన్‌చార్జిని ప్రశ్నించగా ధరలు పెరిగాయని, మెస్ లాస్‌లో ఉందని అందుకే చికెన్ పెట్టలేదని వచ్చేవారం పెడతామన్నారు. ప్రభుత్వం గురుకులానికి పంపిణీ చేసే బియ్యం సరిగ్గా లేక అన్నం ముద్దగా ఉండడంతో విద్యార్థులు తినేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు పెరుగు అందించకుండా మజ్జిగా పోస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటినా విద్యార్థులకు భోజనం వడ్డించడం లేదు. అన్నం, కూరలు తయారు చేసే కిచెన్ పరిసరాలతోపాటు విద్యార్థులకు నీటిని అందించే ప్రదేశం అపరిశుభ్రంగా ఉంది. విద్యార్థులకు సకాలంలో అన్నం వండేందుకు బీఆర్‌ఎస్ సర్కారు సరఫరా చేసిన బాయిలర్స్, మినరల్ వాటర్ ఆర్‌వో ప్లాంట్ కొన్ని నెలలుగా పని చేయడం లేదు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోనే ఎస్సీ వసతి గృహం పక్కనే ఉబికివస్తున్న మురుగు

ఎడ్యుకేషన్ హబ్ ప్రాంగణంలో కంపుకొడుతున్న డ్రైనేజీ

గజ్వేల్, జూలై 24: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు తొమ్మిది ఉన్నాయి. గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్ హబ్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహంలోని డ్రైనేజీ పైపులు నిండిపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. కొద్ది రోజులుగా డ్రైనేజీ పైపుల నుంచి మురుగునీరు పైకి ఉబికివస్తున్నది. వసతిగృహంలోని గదుల్లో కూర్చున్న విద్యార్థులకు వాసన రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే వార్డెన్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా నేటికీ పరిష్కారం కాలేదు. డ్రైనేజీ సమస్యతో వసతిగృహంలోని కింది భాగంలోని కొన్ని గదులను వాడటం నిలిపివేశారు. బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ఎస్సీ, బీసీ వసతిగృహాలు రెండు పక్కపక్కనే ఉన్నాయి. వాటి మధ్యలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వసతిగృహాల చుట్టూ పరిసర ప్రాంతాలు పిచ్చిమొక్కలతో దర్శనమివ్వడంతో పారిశుధ సమస్య తీవ్రంగా కనిపిస్తున్నది. విద్యార్థులకు మెనూ ప్రకారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి సమయంలో నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. వసతిగృహాల వద్ద పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫ్యాక్టరీని సందర్శించిన పీసీబీ అధికారులు

మునిపల్లి, జూలై 24: నమస్తే తెలంగాణలో బుధవారం ప్రచురితమైన 'ఎవరెస్ట్ అంతా కాలుష్యం' అనే కథనానికి సంగారెడ్డి జిల్లా పీసీబీ అధికారులు స్పందించారు. ఎవరెస్ట్ ఆర్గానెస్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న కాలుష్య నీళ్ల శాంపిల్స్‌ను బుధవారం సేకరించినట్లు పీసీబీ అసిస్టెంట్ ఇంజినీరు శ్రావణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంపెనీని సందర్శించి శాంపిల్స్ సేకరించామన్నారు. శాంపిల్స్ ల్యాబ్‌కు పంపుతామని, ఫలితాల అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరికి ఫ్యాక్టరీ జీఎం బెదిరింపులు

ఎవరెస్ట్ ఆర్గానెస్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై వార్త ప్రచురితం చేసినందుకు ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శర్మ నమస్తే తెలంగాణ విలేకరికి వాట్సాప్ కాల్‌చేసి బెదిరించారు. మా ఫ్యాక్టరీపై వార్త రాసేంత దమ్ము ఉందా.. మా వెనకాల కాంగ్రెస్ మంత్రి ఉన్నారు. మంత్రికి సంబంధించిన ఫ్యాక్టరీపైనే వార్త రాస్తావా, నీ పని అయిపోయిందంటూ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శర్మ విలేకరిని బెదిరింపులకు గురిచేశారు. మీరే కాదు మా ఫ్యాక్టరీపై ఎన్ని వార్తలు రాసినా మాకు ఏమి కాదు, మమ్మల్ని, మా కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకోరు...మా వెనకాల మంత్రి ఉన్నారు అని జీఎం బెదిరించాడు.

మాఫీ..మాయాజాలం !

- కాంగ్రెస్ ప్రభుత్వంపై పెల్లుబికుతున్న ఆగ్రహం
- రుణమాఫీ వడపోతపై రైతుల్లో అసహనం
- బ్యాంకుల్లో ఇంకా జమకాని రుణమాఫీ డబ్బులు
- పెరుగుతున్న ఫిర్యాదుదారుల సంఖ్య
- డీసీసీబీలో సగం మంది రైతులకే రుణమాఫీ
- రుణమాఫీకి ఎస్‌బీఐ సీడెడ్ సంఘాల రైతులు దూరం
- సర్కారు తీరుపై రైతులు, రైతు సంఘాల ఆగ్రహం

సంగారెడ్డి, జూలై 24(నమస్తే తెలంగాణ): పంట రుణమాఫీ తీరుపై రైతుల్లో ఆగ్రహం పెల్లుబికుతున్నది. రేవంత్ సర్కార్ పంటరుణమాఫీ విషయంలో మాట తప్పిందని రైతులు గుర్రుగా ఉన్నారు. రూ.2 లక్షల వరకు రుణం మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి అధికారం చేపట్టగానే మాట తప్పడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ అమలు కంటే రుణమాఫీ వడపోతపైనే రేవంత్ సర్కార్ ఎక్కువగా దృష్టిపెట్టిందని, రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల పేరుతో తక్కువ మొత్తంలో రైతులకు రుణమాఫీ అయ్యేలా జాగ్రత్త పడిందని రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రుణమాఫీపై రైతుల్లో ఇంకా సవాలక్ష ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదో తెలుసుకునేందుకు రైతులు బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు పంటరుణ మాఫీ అయ్యిందా లేదా? అసలు, వడ్డీ కలిసి ఎంత రుణం ఉంది?ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ డేట్ లోపే రుణం చెల్లించినా ఎందుకు రుణమాఫీ కాలేదు? పంటరుణం రీషెడ్యూల్ చేసుకున్నా ఎందుకు మాఫీ కాలేదు? తదితర ఫిర్యాదులతో రైతులు ప్రతి రోజు వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకర్లను కలుస్తున్నారు. బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు ఏమి సమాధానం చెప్పలేక తదుపరి జాబితాలో మీపేరు ఉంటుందని రైతులకు నచ్చజెప్పి పంపుతున్నారు. దీంతో రైతులకు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. రుణమాఫీ అమలు కాలేదంటూ ఫిర్యాదు చేస్తున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 300 మందికిపైగా రైతులు రుణమాఫీ కాలేదంటూ అధికారులు, బ్యాంకర్లకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేస్తున్న రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉన్నది.

ఇంకా జమకాని రుణమాఫీ డబ్బులు...

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ డేట్‌లో రూ.లక్ష లోపు రుణం తీసుకున్నవారి సంఖ్య 1.50 లక్షల మందికిపైగా ఉంటారు. జిల్లాలో మొత్తం 51167 మంది రైతులకు రూ.279.60 కోట్ల రుణం మాఫీ అయ్యింది. ప్రభుత్వం 50,555 మంది రైతులు ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమ చేసింది. ఇంకా 612 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. జాబితాలో తమపేరు ఉన్నప్పటికీ ఇంకా రుణమాఫీ డబ్బులు జమకాకపోవటం పై 612 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

డీసీసీబీలో సగం మందికే రుణమాఫీ...

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో పంటరుణాలు తీసుకున్న రైతులకు వందశాతం రుణమాఫీ కాలేదు. సంగారెడ్డి జిల్లాలో డీసీసీబీ పరిధిలో 53 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 37 సంఘాలు డీసీసీబీ పరిధిలో ఉండగా, 16 బ్యాంకులు ఎస్‌బీఐ పరిధిలో ఉన్నాయి. డీసీసీబీ పరిధిలోని 37 పీఏసీఎస్‌లలోని 13,269 మంది రైతులు లక్ష రూపాయల్లోపు రూ.56.01 కోట్ల పంటరుణాలు తీసుకున్నారు. కాగా, ప్రభుత్వం 6090 మంది రైతులకు మాత్రమే రూ.25.13 కోట్ల మేర పంట రుణాలు మాఫీ చేసింది. మిగతా 7179 మంది రైతులు ప్రభుత్వం తమ పంటరుణాలు మాఫీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో ఉన్న 16 పీఏసీఎస్‌లు సీడెడ్ బ్యాంకులుగా ఉన్నాయి. 16 సీడెడ్ బ్యాంకుల పరిధిలో 8వేల మందిరైతులు సభ్యులుగా ఉన్నారు. 2017 వరకు సీడెడ్ సొసైటీల్లోని రైతులు లక్షల నుంచి రూ.2 లక్షల పంటరుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం రుణమాఫీకి ప్రకటించిన కటాఫ్ డేట్‌లో సీడెడ్ సొసైటీ సభ్యులు రావడం లేదు. దీంతో సీడెడ్ బ్యాంకుల్లో పంటరుణం తీసుకున్న రైతులు తమకు పంట రుణం వర్తింపజేయాలని కోరుతున్నారు.

పంట రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయాలి

సిద్దిపేట, జూలై 24: లక్ష పంట రుణమాఫీ అయిన రైతులకు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరులోపు కొత్త రుణాలు అందజేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి బ్యాంక్ అధికారులకు సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐని ఆయన సందర్శించారు. పంట రుణ మాఫీ రీషెడ్యూల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పంట రుణ మాఫీ అమలు చేస్తున్నదన్నారు. లక్ష పంట రుణ మాఫీ కాని రైతుల ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రతి బ్యాంకులో ఎంక్వయిరీ సెంటర్ ఏర్పాటు చేసి వ్యవసాయాధికారుల సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతి బ్యాంకులో రోజూ 100 మంది రైతుల పంటరుణాలు రెన్యూవల్ చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబును ఆదేశించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ వికాస్, మేనేజర్ సురేశ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ జయంత్, మేనేజర్ సుధీర్, బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట: ఎస్‌బీఐ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

పంట రుణమాఫీ బృహత్తర కార్యక్రమం

మెదక్, జూలై 24 (నమస్తే తెలంగాణ): పంట రుణ మాఫీ బృహత్తర కార్యక్రమమని, రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో రుణమాఫీపై వ్యవసాయ, లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా కోఆపరేటివ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 47,616, మంది రైతులకు రూ.లక్షలోపు రూ.237.50 కోట్ల పంటరుణమాఫీ జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పంటరుణమాఫీపై వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకొని పకడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ భూమి ఉండి పంటరుణం తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఎవరికైనా పంటరుణ మాఫీ కాకుంటే మండల లేదా జిల్లా వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. పంటరుణమాఫీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, జిల్లా కోపరేటివ్ అధికారి కరుణ పాల్గొన్నారు.

వట్‌పల్లి : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

తెలంగాణకు మొండిచేయి

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

వట్‌పల్లి, జూలై 24 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ర్టానికి మొండి చేయి చూపించిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ నుంచి బీజేపీకి ఎనిమిది ఎంపీలు అందించినా ప్రజలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ఏపీకి రూ.16 వేలకోట్లు కేటాయించి తెలంగాణ రాష్ర్టానికి అన్యాయం చేశారని గుర్తుచేశారు. సమావేశంలో వరం అధ్యక్షుడు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివాజీరావు, నాయకులు బుద్ధిరెడ్డి, నర్సింహులు, రాజేందర్‌రావు, సత్తార్, మధు, చంద్రశేఖర్, మహేందర్‌గౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణకు బీజేపీ ద్రోహం

నారాయణఖేడ్, జూలై 24: బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం తెలంగాణకు తీరని ద్రోహం చేసింది. విభజన హామీలను దృష్టిలో పెట్టుకుని రాష్ర్టానికి నిధులు కేటాయించాల్సిన కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు కనీసం ప్రాధాన్యత ఇవ్వలేదు. మిత్ర పక్షాలను సంతృప్తి పర్చేరీతిలోనే బడ్జెట్ రూపొందించినట్లు స్పష్టంగా అర్థమవుతున్నది. గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టినపుడు నిధుల విషయంలో బీఆర్‌ఎస్ ఎంపీలు కేంద్రాన్ని నిలదీశారు ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– భూపాల్‌రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే

ఉపాధి కూలీల పొట్టకొట్టారు

నిజాంపేట, జూలై 24: కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ర్టానికి తీరని అన్యాయం జరిగింది. దేశంలో ఏపీ, బీహార్ రాష్ర్టాలకు మాత్రమే మోదీ ప్రభుత్వం నిధులు కేటాయించ డం విడ్డూరంగా ఉన్నది. ఉపాధిహామీ పథకానికి గండి కొట్టే విధంగా నిధులు తక్కువ కేటాయించి కూలీల పొట్టకొట్టారు.

– దుబాషి సంజీవ్, డీబీఎఫ్ అధ్యక్షుడు, మెదక్ జిల్లా

పంట రుణమాఫీ డబ్బులు జమచేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో రైతుల పంటరుణమాఫీ వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కల్హేర్, జూలై 24: పంట రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, రెన్యువల్ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రూ.లక్షలోపు ఎంత మంది రైతులకు రుణమాఫీ వర్తించిందని ప్రశ్నించగా 660 మందికి వచ్చిందని బ్యాంక్ మేనేజర్ జాదవ్ సంతోష్ తెలిపారు. ఇప్పటి వరకు 120 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. కోటి రూపాయాలు జమచేయడం జరిగిందని, మిగిలిన 440 మంది రైతుల పంటరుణాలను వారి ఖాతాల్లో జమచేస్తామన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసిన పంటరుణమాఫీపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మూడు, నాలుగో తరగతి విద్యార్థులతో గుణింతాలు చదివించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలలో డిజిటల్ టీవీలను ఎందుకు వినియోగించడం లేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు.

బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేటీఆర్ బర్త్‌డే వేడుకల్లో బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూలై 24: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపు లేకుండా చూడటం సిగ్గుచేటుగా ఉందన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎంపీలు మౌనంగా ఉంటూ రాష్ట్ర ప్రయోజనాలను నరేంద్రమోదీ సర్కారుకు తాకట్టుపెట్టారని మండిపడ్డారు. తెలంగాణకు గుండుసున్న నిధులు కేటాయించినందుకు రాష్ట్ర ప్రజలు బీజేపీ ఎంపీలను అడుగడుగునా ప్రశ్నించాలన్నారు. మోదీ సర్కారు తెలంగాణపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ తీరు చూస్తుంటే ఇక్కడ చోటే బాయ్...అక్కడ బడే బాయ్ అన్నట్లు ఉందన్నారు. చోటే బాయ్ రాష్ట్ర నిధులను హైకమాండ్‌కు తరలిస్తుంటే బడేబాయ్ సంకీర్ణ ప్రభుత్వంలోని బీహార్, ఏపీలకు నిధులు కేటాయించి తెలంగాణ రాష్ర్టానికి మొండి చేయి చూపారన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా, నిధులు, ములుగు గిరిజన విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులేదని, బయ్యారం స్టీల్ ప్లాంట్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ధనిక రాష్ట్రంగా బలపడిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు రూ.20వేల కోట్ల రైతుబంధును ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, జూన్‌లో ఇవ్వాల్సిన రైతుబంధు నేటికీ ఇవ్వలేదన్నారు.

ఘనంగా కేటీఆర్ బర్త్‌డే వేడుకలు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను బుధవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు నవాజ్‌మీరా, శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, కౌన్సిలర్లు, అత్తెల్లి శ్రీనివాస్, గుంటుక రాజు, కిషన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, జఫర్‌ఖాన్, గొడుగు స్వామి, నర్సింగ రావు, ఉపేందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కవిత, శివకుమార్, హైదర్‌పటేల్, బీమప్ప, కిరణ్, ఎక్బాల్, అహ్మద్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న బీఫార్మసీ, పీజీ విద్యార్థుల వసతి గృహం

నర్సాపూర్, జూలై 24: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సమీపంలోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం ఆవరణంలో పందులు స్వైర్యవిహారం చేస్తున్నాయి. బీఫార్మసీ, పీజీ కళాశాల విద్యార్థుల వసతి గృహం శిథిలావస్థకు చేరుకున్నది. ఈ రెండు వసతి గృహాల పక్కనే మురుగు ఏరులై పారుతున్నది. వసతి గృహానికి సంబంధించిన బాత్‌రూమ్ తలుపులు ఊడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలోని కిటికీలకు, బాత్‌రూమ్‌లకు తలుపులు ఊడిపోయి, ఇరిగిపోయి ఉన్నాయి.హాస్టల్ వెనుకాల మురుగు ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈగలు, దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నర్సాపూర్ పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు పనిచేయక విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ ఆశ్రయం పొందుతున్నారు.

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

జీతాలు లేక ఇబ్బందులు

సంవత్సరంన్నర నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. గతంలో ట్రెజరీ నుంచి జీతాలు ఇచ్చేవారు ఇప్పుడు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమిస్తామంటున్నారు. 22 ఏండ్ల నుంచి వసతి గృహంలో వాచ్‌ఉమెన్‌గా, వంట మనిషిగా పనిచేస్తున్నా. జీతం చెల్లించాలని సెక్రటేరియట్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి నా ఇప్పటి వరకు చెల్లించలేదు. అధికారులు పెండింగ్ జీతాలు చెల్లించాలి.

– లక్ష్మి, కుక్, బీసీ బాలికల వసతి గృహం, నర్సాపూర్